"**మూడ్రూపాయల**కొక్క పైసా తక్కువైనా నానొప్పుకోను!" అని నిర్మొహమాటంగా చెప్పేసింది నాగమ్మ.

"ఏటే నువ్వు మరీని! ఇలా మాటిమాటికి రేటెచ్చించేత్తే నాలాటోళ్లేటిచ్చుకోగల్రు? .... ఈ పరీటికి పాతరేటు పెకారం వొప్పేసుకో!" ప్రాధేయపడ్డాడు పాపయ్య.

"నాబంనేదు! .... మూడ్రూపాయలివ్వడానికి నువ్విష్టపడితేనే బేరం కుదుర్తది! నేకపోతే సల్లగా వొచ్చిన దారంటే ఎల్లిపో!" నిష్కర్షగా చెప్పేసింది నాగమ్మ.

"అయినా ముందుగా ఏటీ సెప్పకుండా సెయ్యకుండా నువ్విలా గుబుక్కున రేటు పెంచేత్తే నాలాటోళ్లకేటి తెలుత్తాది సెప్పు? అలవోటు పెకారం రెండురూపాయలు తెచ్చినాను మరి కాదనక ఇయ్యాల్టికొప్పేసుకో."

"ఎల్లెల్లు! ... ఇలాపింటి బేరాలు నాకాడ పనికిరావు!" చీదరించుకుంది నాగమ్మ.

"నువ్వెలిపొమ్మన్నంత మాత్రంలో నానియ్యాల ఎలిపోతాననుకున్నావేటి? కసింత సుక్కేసుకొని మంచి సర్దాగొచ్చినా నిక్కడికి. నా సర్దా తీర్చుకోకుండా నానెల్లనంటే ఎల్లను. అంతే!" అంటూ బైఠాయించేడక్కడ.

"ఇదుగో సూడూ! ... ఎర్రిమొర్రి ఏసాలేసేవంటే మరేదా దక్కదు! మూడ్రూపాయలిత్తేనే నీ సర్దా ఇక్కడ తీరుద్ది! ...నేదా తిన్నగా నీ పెళ్లాంకాడికెలిపో!" అని నాగమ్మ అనేసరికి పాపయ్య ఆవదం తాగినవాడిలా మొహం పెట్టి, "ఛాత్! అదంటే నాకు మాసెడ్డ అసేయం!" అని కొంచెంసేపు మౌనంగా ఊరుకొని, నాగమ్మ ముఖంలోకి పరిశీలనగా చూస్తూ, "నీ సక్కదన మెక్కడ! ... దాని సక్కదన మెక్కడ! అదో దెయ్యం నాగుంటాది. నువ్వో దేవతనాగుంటావు! నీకాడుంటే సొరగంలో ఉన్నట్టుంటాది. దానికాడుంటే నరకంలో ఉన్నట్టుంటాది!" అన్నాడు.

ఈ పొగడ్తకు నాగమ్మ సంతోషంతో ఉబ్బిపోయి అమాంతంగా తనను కౌగలించేసుకుంటుందనుకున్నాడు. కాని నాగమ్మ ఈ పొగడ్తకు ఏమీ ఉబ్బిపోలేదు!

"మరయితే అంత నచ్చనిదాన్నెందుకు పెళ్లాడినావు?" అని నిలదీసి అడిగింది.

"మరేటి సెయ్యమంటావు? నాకు నచ్చిన దెవుర్తీ నన్ను పెళ్లాడడాని కిష్టపడనేదు!" ఈ సమాధానం చెప్పడానికి పాపయ్య ఏమీ సిగ్గుపడలేదు.

"ఏం?" అంటూ పాపయ్య ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసింది నాగమ్మ.

"నాను పావులోణ్ణికదా మరి!... పావులోడికి పావు వల్లే సావొత్తాదని సాలామంది అనుమానం! ఈ అనుమానంవొల్లే అందమైన దెవుర్తీ నన్ను పెళ్లాడడాని కిష్టపడనేదు" అని సమాధాన మిచ్చేడు.

"మరి పోలమ్మ నిన్ను పెళ్లాడినాది గందా; దానికీ అనుమానం నేదంటావా?"

"ఆ దరిద్రగొట్టుదాన్ని నానుగనక పెళ్లాడినాను. ఇంకొకడెవుడూ పెళ్లాడడు! ... ఇంతకీ అదొట్టి ఎర్రిబాగుల్ది! శివునాగ్న నేకపోతే సీవయినా కుట్టదని దాని

నిత్యమూ మృత్యువుతో చెలగాటమాడే వాళ్లకు చావంటే భయం ఉండదు. చాలక నిర్లక్ష్యంకూడా ప్రబలుతుంది. ఆ స్థితి రాకూడదు కాని వచ్చిందంటేమాత్రం అలాంటి వాళ్లు ఇతరులకేకాదు, తమకుకూడా ముప్పు తెచ్చుకొంటారు. కలలోనైనా కీడు తల పెట్టనివారికి సహితం అపకారం చేయాలనే తలంపు దానికి లోడయితే?

నమ్మకం. అయినా ఇప్పుడు దాని ఊసెందుకులే! నీ మొగం సూత్తూ దాన్ని తల్సుకుంటే అదోలా ఇకారంగా ఉంటాది నాకు. అంచేత మరి దాని ఊసెత్తకు!" అన్నాడు పాపయ్య.

"అదంటే అంత అసేయమయినప్పుడు దాన్నొగ్గేయొచ్చుగా!" అని సూచించింది నాగమ్మ.

"ఒగ్గేయ్యొచ్చనుకో! ... మరి నాను దాన్నొగ్గేత్తే ఇంకెవర్తయినా నన్ను పెళ్లాడుద్దా అని?"

"ఏం? ... ఎందుకు పెళ్లాడదు? ... నీకేటి లోటని? రోజుకెలా నేదన్నా నాలుగైదు రూపాయలు తెత్తున్నావుగదా!"

తన సంపాదన రోజుకు నాలుగైదంటే చాలా చిన్నతనమనిపించింది పాపయ్యకు! "నాలుగైదేటే! ... ఇంకా ఎక్కువే! ... నా పావులు సల్లగుండాలిగానీ నాకేటి లోటే? ... రోజుకు నాలుగైదాటలేత్తుంటాను. ఆటకు రూపాయిన్నరకెప్పుడోగాని తక్కువుండదు. ఈమద్దె తాగుడి కలవాటుపడ్డంవల్ల డబ్బుకి రొక్కట పడిపోతన్నానుగానీ నేకపోతే నాకేటి నోటే?"

"నువ్వు పోలమ్మనొగ్గేసి తాగుడు మానేసినట్టయితే నిన్ను నాను పెళ్లాడేత్తాను! .. డబ్బుకోసం అడ్డమైన అవసంతి ఎదవలకి వొళ్లప్పసెప్పే ఈ పురుత్తంటే నా కిప్పుడిప్పుడసేయం ఏత్తన్నాది. ఒంటికేదైనా రోగం వొచ్చినా, వయసుమల్లినా నాలాటిదాన్ని అబిమానంతో ఎవుడు సూత్తాడు సెప్పు? అంచేత అందరినాగే నానూ సక్కా పెల్లి సేసుకొని సంసారం సేసుకోవాలనుకుంటున్నాను" అని నాగమ్మ అనేసరికి పాపయ్య నేత్రాలు సంభ్రమాశ్చర్యాలతో ప్రకాశవంతాలయేయి. మధురాతిమధురమైన వాంఛతో ఉద్రిక్తుడయ్యేడు.

"నువ్వు నన్ను పెళ్లాడతానంటే నాకంతకంటే ఈ నోకంలో కావలసిం దింకేటుందే? పోలమ్మనొగ్గేత్తాను. తాగుడు మానేత్తాను. మరి నువ్వేటి సెయ్యమంటే అదే సెత్తాను. కాని నాకో సిన్న అనుమానం!"

"ఏటది?"

"మరి నువ్వేటనుకోనంటే సెపతాను."

"ఏటనుకోనులె, సెప్పు."

"డబ్బుకోసం అడ్డమైన ఎదవల్తోటీ పోయే అలవోటు నీకున్నాది గందా; మరి ఈ అలవోటు నన్ను పెళ్లాడినాక నీకు పోద్దా అని?" తనను పెళ్లాడక ముందు అది ఎటువంటి దుశ్శీలవతి అయినా

**ఆకుండి నారాయణమూర్తి**

పాపయ్యకు బాధలేదు. కాని తనను పెళ్లాడేక అది మహాపతివ్రతగా మారిపోవాలి! ఇదొక విలక్షణమైన మానవ మనస్తత్వం.

"పెళ్లాముండగా రంకుముండల్తోటి పోయే అలవోటు నువ్వు మార్చుకున్నప్పుడు అక్కడికి నానేనేటి నా అలవోటుని మార్చుకోలేను?" ప్రశ్నలాంటి సమాధాన మిచ్చింది నాగమ్మ.

"అబ్బో! నామీదే కొట్టినావే దెబ్బ! ... ఇదుగో సూడు ... నువ్వుగాని నన్ను పెళ్లాడితే సచ్చేదాకా మరెవుత్తితోనూ పోనని పెమానం సేత్తాను!" అన్నాడు పాపయ్య.

"ఎందుకొచ్చిన మాటలివన్నీ? ... ముందు నువ్వు పోలమ్మ నొగ్గే సిరా; అప్పుడు మాటాడుకుందాం!"

"వొగ్గేయడమంటే ఏటంత పెద్ద కష్టమైన పననుకున్నావేటి? వొగ్గేసేనంటే వొగ్గేసేనన్నమాటే! ఇక తిరుగు నేదనుకో!"

"పెళ్లాన్నొగ్గేయడమంటే మజాకా అనుకున్నావేటి? .... మునపట్లా గాదు....అన్నాయంగా పెళ్లాన్నొగ్గేసి మరోదాన్ని పెళ్లాడితే జుత్తట్టుకొని జైల్లో తోసేసి సిచ్చించేత్తారు గవుర్నమెంటోరు! ... తెలుసా?"

"ఏటీ! ... జైల్లో ఏసేత్తారా? నీ కెవురు

## పెళ్లి

సెప్పేరీ సంగతి?"

"ఈరయ్య మావ నాకీ సంగతంతా సెప్పినాడు. ఆడు పెళ్లాం ఉండగా మరోదాన్ని పెల్లి సేసుకున్నాడు. అప్పుడు తొలి పెళ్లాం కేసెట్టింది. ఆ యవ్వారంలో ఆడికి ఆరేల రూపాయలు ఖర్చయినాయి. నెలకి ఇరవై రూపాయల సొప్పున బరనం ఇవ్వాలని తీరుపు సెప్పినారు. ఆడు డబ్బున్నోడు గాబట్టి సరిపోనాదిగాని నేకపోతే జైల్లో కూకోనుండేవోడు. తొందరపడితే నీకూ అదేగతి పడతాది తెల్సా?"

"అయితే మరి దాన్నెలాగొగ్గేయడం?"

"దీని కొకటే సులువు! ... దానంతటదే నిన్నొగ్గేసేటట్టు సేసుకోవాల!" అని సలహా చెప్పింది నాగమ్మ.

"అది నన్నెందు కొగ్గేత్తాది? ... వొగ్గదు! నీకేటి తెల్సు దాని సంగతి? ... అది గొప్ప పతివ్రోతే! ... పతివ్రోతలెన్నడూ ఆళ్లంతటాళ్లు మొగుళ్లనొగ్గేయరు. మొగుళ్లే పతివ్రోతల నొగ్గేత్తుంటారు! ... అంచేత అది పతివ్రోతగనక నానే దాన్నొగ్గేత్తాను" అన్నాడు పాపయ్య.

"నువ్వు దాన్నొగ్గేయడానికి రూల్సొప్పుకోవు ..... కాని అది నిన్నొగ్గేయడానికి రూల్సొప్పుకుంటాయి. నాకీ మొగుడక్కర్లేదని అది రూల్సు పెకారం నీ కిడాకు లిచ్చేసిందనుకో. అప్పుడు నిన్ను నాను పెళ్లాడేత్తాను! ఒకేళ సి కది ఇడాకు లివ్వదనుకో. అప్పుడు



## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవుచున్నది, మీ సరియైన చర్యను గురించిన్ని మీరు తెలుసుకొనగోరినచో ఒక పోస్టు కార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాసూ, వెంటనే వ్రాసి పంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీ మొదలు 12 మాసములలోనూ మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము ఏ వ్యవహారములో మీకు లాభము కలుగునో ఉద్యోగ విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్ ద్రవ్యలాభము మొదలగు వానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1–25 పైకమునకు వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధము కూడా తెలుపగలము వివరములు మా ఫలితంపైన పంపబడును. మేము పంపిన ఫలితములు మీకు తృప్తిగా లేనిచో పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయుండి.

**PT. DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A.P.W.)**
**POST BOX NO. 86, JULLUNDUR CITY.**




# ఇన్‌డ్కో వజ్రాలు

★ ఖచ్చితమైన, శాస్త్రీయమైన కోత
★ కళ్లు జిగేలుమనిపించే తళుకు, కంటికింపైన నడురు
★ అన్ని రకాల నగలకు తగినట్టివి

**ది తిరుచి సింథెటిక్ జెమ్ కట్టర్స్**
**ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ సొసైటీ లిడ్.**
**45, అల్లిమాల్ స్ట్రీట్, తిరుచిరపల్లి-8**

ఇన్‌డ్కో వజ్రాలు లభించే చోట్లు:
45, అల్లిమాల్ స్ట్రీట్, తిరుచిరపల్లి-8లోగల సేల్స్ కౌంటర్
ఇన్‌డ్కో ఎంపోరియమ్, 25-B,నార్త మాడా స్ట్రీట్, మైలాపూర్, మద్రాసు-4
కాశ్మీర్ నుంచి కొమరిన్ వరకు సర్వదా తిరుగుతూ వుండే మా ట్రావెలింగ్ సేల్‌మన్ వద్ద


నాను మరో మంచోణ్ణి సూసుకొని పెళ్లాడేత్తాను. అంచేత నీ తెలివుపయోగించి అది నీ కిడాకు లిచ్చేటట్టు సేసుకో!" అని నాగమ్మ అనేసరికి పాపయ్య మరేమీ ఆలోచించకుండా ఓ తిరుగులేని నిశ్చయానికి వచ్చేశాడు.

తన కది విడాకులిస్తే సరేసరి; లేకపోతే దాన్ని గుప్‌చిప్‌గా చంపెయ్యాలనేటంత క్రూరమైన నిశ్చయమది!

ఇంటికి వెళ్లాడు జోరుగా!

"ఒలే పోలీ! ... నువ్వు నన్నొగ్గేయాల!" అని పోలమ్మ ముఖంలోకి తీక్ష్ణంగా చూస్తూ అడిగేడు పాపయ్య.

పోలమ్మ ఎంతో భయంతో భర్తవేపు చూసింది. తను చేసిన నేరమేమిటన్నట్లుందా చూపు!

"ఏటా ఎఱ్ఱి సూపు? నువ్వు నాకు మరేదాగా ఇడాకు లివ్వకపోతే నిన్ను సంపేత్తాను!" అన్నాడు పళ్లు పటపట కొరుకుతూ.

"నాలో దోసమేవోనా ఉంటే సెప్పు; నువ్వు కోరినట్టు ఇడాకు లిచ్చేత్తాను!" అంది పోలమ్మ రుద్ధకంఠంతో.


"నీలో దోసముంటే ఇన్నాల్లూరుకుంటానా?... ఏనాడో మక్కెలిరగ బొడిసి సంపేసుండేవోడిని! అసలు నువ్వు నాకో పీడనాగ పట్టుకున్నావు! నీపీడ నా కొగ్గిపోతేనేగాని నాగమ్మ నన్ను పెళ్లాడదు. దాన్ని పెళ్లాడకపోతే నాను సుకంగా బతకలేను. నాను సుకంగా బతకాలంటే నీ పీడ నా కొగ్గిపోవాల! . ఇదీ సంగతి! ఇప్పుడు సెప్పు? ... నువ్వు నా కిడాకు లిత్తావా ఇవ్వవా?" అనడిగేడు పాపయ్య.

తన భర్త నాగమ్మ వ్యామోహంలో పడ్డాడన్న సంగతి పోలమ్మకు అంతకు ముందే తెలుసు. కాని తనకా విషయం తెలిసినట్లు భర్తఎదట ఆమె ఎన్నడూ బయటపడలేదు. అంటే ఆమె సహనశీలత సామాన్య స్త్రీ సహనశీలతకంటె విశిష్టమైనదని ఒప్పుకోక తప్పదు. ఇది పత్తెకాలపు స్త్రీల లక్షణమని కొందరి భావం! పత్తెకాలపు స్త్రీలను చూసి నేటికాలపు స్త్రీలు కొంతమంది అసహ్యించుకుంటారన్న సంగతి పోలమ్మకు తెలీదు. ఒకవేళ తెలిసినా కాలానుగుణంగా ఆమె మారలేదేమో!

పోలమ్మ పట్టి పత్తెకాలపు మనిషి కాబట్టే "దాన్ని పెళ్లాడాలనుకుంటే పెళ్లాడుకో. నానేటి అడ్డుసెప్పను. దానూసెత్తను. దాని సేవ సెయ్యమంటే సేత్తాను. అంతేకాని నీకు నానిడాకు లివ్వను! పూర్వజలమలో ఎన్నో పాపాలు సెయ్యబట్టే ఈ జలమలో ఇలాపింటి ఎదవ పుట్టక పుట్టేనాను. మొగుడికి ఇడాకు లివ్వడమంటే ఏవంత సిన్నపాప మనుకున్నావేటి? ... అది మహా గోరపాపం! నువ్వేటి సేసినా సరే నానీ గోరపాపం సెయ్యదల్సుకోలేదు. ఎన్ని కష్టాలొచ్చినా సరే పతివ్రోతగానే బతకాలనుకుంటున్నాను" అనంది.

"ఎలాపింటిదాన్ని పతివ్రోతంటారో తెలుసా? ... మొగుడేటి కోరితే ఆ పని సేసేదాన్ని పతివ్రోతంటారు. అంచేత నాను కోరినట్టుగా నా కిడాకు లిచ్చెయ్!" అన్నాడు పాపయ్య.

"నా కంటంలో పేనం ఉండగా నాను నీ కిడాకు






ఒక ప్రత్యేకత వుంది

**అజంతా**

**41 & 51 టూత్ బ్రష్‌లకు**

వీటిని మీకోసమే ప్రత్యేకంగా సృష్టించారు :

ప్రత్యేకంగా ఎంచిన నైలాన్ బ్రిసల్స్‌తో- మెత్తగా, గుండ్రంగా తయారుచేసిన కుచ్చులు, అజంతా 41 కు ప్రత్యేకంగా అమర్చిన నిడుపైన హేండులు మూలంగా, మూలనున్న పండ్లను కూడా అవలీలగా తోముకోవచ్చు. కుచ్చుకూ, మీరు హేండలును పట్టుకొనే చోటుకూ దూరం తగినంత వుండటం మూలంగా, ఎటువంటి కష్టమూ లేకుండా మీరు పండ్లన్నీ తోముకోగలరు.

పరిశుభ్రతకూ, పారిశుధ్యానికీ, ఈ బ్రష్షులు ప్రతిఒక్క దానినీ, అందమైన ప్లాస్టిక్ కేసులలో పేక్ చేసారు.

ఇతర ఉత్పత్తులు: అజంతా షేవింగ్ బ్రష్, అజంతా హెయిర్ బ్రష్

హేండిల్, పేకింగ్ డిజైనులు రిజిస్టరు చేయబడినవి.

ది బాంబె బ్రష్ కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్
బొంబాయి-34.

RB/BB/TEL/06A

లివ్వను" అని పోలమ్మ అనేసరికి పాపయ్యకు ఒళ్ళు మండింది. పళ్ళు పటపట కొరుకుతూ రెండు చేతుల తోనూ దాని పీక పట్టుకొని "మరేదాగా నువ్వు నాకిడాకు లిత్తే, నిన్ను వానేటీ అనను! ... నేదా ఇలా పీకపిసికి సంపేత్తాను!" అన్నాడు.

"నన్నిలా పట్టపగలు పీకపిసికి సంపేత్తున్నప్పుడు ఎవురేనా సూత్తే నీకే పెమాదం! ఆలోసించుకో!" అని గొణిగింది.

అలా పట్టపగలు ఆమెను హత్య చెయ్యడంవల్ల తనకొచ్చే ప్రమాదాన్ని కాస్సేపాలోచించి అవగతం చేసుకున్నాడు పాపయ్య. హత్యానేరం ఋజువైతే మరణ దండనకంటే తక్కువ శిక్షేదీ తనకు విధించబడదన్న సంగతి తెలియనంతటి అవివేకి కాడతను.

"నిన్నెప్పుడు ఎలా సంపడవో నాకు తెల్దనుకోకు. నాకంతా తెల్సు. పోనీకదా అని రేపు ఉదయం వరకూ నిన్ను సంపకుండా వొదిలిపెట్ట దల్సుకున్నాను. ఈలోగా బాగా ఆలోసించుకో!" అంటూ ఆమెను పక్కకో నెట్టు నెట్టి గబగబా వెళ్ళిపోయేడు వీధిలోకి.

తాగుడు మైకంలో ఉండబట్టి తన భర్త అలా ప్రవర్తించేడేగాని లేకపోతే అలా ప్రవర్తించి ఉండేవాడు కాడని సరిబుచ్చుకుంది పోలమ్మ.

ఎంతలా భయపెట్టినా పోలమ్మ తనకిక విడాకులిచ్చే టట్లు లేదన్న సంగతి గ్రహించేడు పాపయ్య. అంచేత దాన్ని ఎలాగైనా చంపెయ్యాలనుకున్నాడు.

ఎలా చంపడం?

ఆలోచనలో పడ్డాడు పాపయ్య.

అలా ఎంతోసేపు ఆలోచించగా ఆఖరికొక మంచి పద్ధతి స్ఫురించిందతనికి.

పాముకాటువల్ల ఆమె చనిపోయిందని లోకాన్ని నమ్మించడం ఏమంత కష్టమైన పని కాదనుకున్నాడు!

తను సరికొత్తగా పట్టిన కోడెనాగుని ఆమె నిద్ర పోతున్న సమయంలో పక్కలో వొదిలిపెడితే తన సంకల్పాన్ని అదే నెరవేరుస్తుందని ఆశించేడు!

ఏదో ప్రమాదవశాన ఆ పాము ఆమెను కరిచి ఉంటుందని లోకులు భావిస్తారేకాని, తనే ఆ పాముచే ఆమెను కరిపించి ఉంటాడని ఎవ్వరూ భావించరని పాపయ్య భావన!

ఆ పాము ఆమెను కరిచిన తరవాత ఏదో మంత్రం వేసినట్టు, మందూ మాకూ పెట్టినట్టు చుట్టూ మూగినవాళ్ళ ఎదట కొంచెంసేపు నటించి, అది చచ్చేక బొల్లేడుపు ఓసారి ఏడ్చేస్తే తీరిపోతుందనీ, ఆ తరవాత తననెవరూ ఏ విధంగానూ అనుమానించరనీ భావించేడు.

ఆమెను అంతమొందించడానికి ఇంతకన్నా మంచి పద్ధతి ఇంకొకటేదీ స్ఫురించలేదు పాపయ్యకు.

* * *

తాననుకున్న విధంగా భార్యను చంపెయ్యాలనే దృఢనిశ్చయంతో ఇంటికి తిరిగి వచ్చేడు పాపయ్య. దగ్గిరగా వేసిఉన్న తలుపు మెల్లిగా తోసి లోనికి తొంగి చూసేడు. నిద్రపోతున్న పోలమ్మ తలదగ్గిర పడగెత్తి కాటు వెయ్యడానికి సిద్ధంగా ఉన్న ఓ నాగు పామును చూసి నిర్ఘాంతపోయేడు!

అది అతని దగ్గిర ఉన్న పాముల్లోని పాము కాదు!

అది ఎక్కడనుంచో వచ్చింది! అతని దగ్గిర ఉన్న పాముల్లో ఏ పాముకైనా అది ఆత్మీయురాలైతే కావచ్చు!

విచిత్రం ఏమిటీ అంటే తను సరికొత్తగా పట్టిన కోడెనాగుచే కాటేయించి ఆమెను చంపెయ్యాలనే దుష్టసంకల్పంతో వచ్చిన పాపయ్య మరేదో నాగుపాము ఎక్కడనుంచో వచ్చి ఆమెను కాటెయ్యడానికి సిద్ధంగా ఉన్నప్పుడు చూస్తూ ఊరుకోలేకపోయేడు! అతనిలో అణిగి మణిగిఉన్న మానవత్వం అకస్మాత్తుగా మేల్కొంది! అతను ఏసంకల్పంతో అక్కడికి వచ్చేడో ఆ సంకల్పాన్ని విస్మరించి గబుక్కున వెళ్లి ఆ పాము పీక పట్టుకున్నాడు. దీనిని అసంకల్పిత ప్రతీకారచర్య అని అనవచ్చా? అనకూడదేమో!

పాముల్ని పట్టడంలో ఎంతో అభ్యాసమున్న పాపయ్య ఆవాళ ఆ గాభరాలో కాస్త ఒడుపుతప్పి పట్టుకున్నాడు!

కాటేసిందా విషసర్పం!

పాపయ్య పళ్లు పటపట కొరుకుతూ "ఓసే నాగూ! నా నెవుడి ననుకున్నావు? ... పాముల పాపయ్యను! నన్ను కాటేసి నువ్వు తప్పించుకు పోవాలను కున్నావు గావాల. నా దగ్గిర నీ పప్పులుడకవు! మీ పాముల మధ్య బతుకుతున్న నాకు మీ పాములకన్నా ఎక్కువ పగ అన్న సంగతి తెలుసుకో! ఇయ్యాలతో మన పని సరి! సావు ... సావు ... సావు!" అంటూ దాన్ని గిరగిర తిప్పి నేలకేసి కసితీరా బాదేడు.

దానికి తలప్రాణం తోకకొచ్చింది!

పాపయ్యకు విషం తల కెక్కింది! పోలమ్మ పక్కలోకి ఒరిగిపోయేడు.


పోలమ్మ ఆత్రంగా లేచి నురుగులు కక్కుతూ పడిఉన్న తన భర్తనూ, తోకలో ఇంకా కాస్త జీవం కొట్లాడుతున్న నాగుపామునీ చూసి కెవ్వున కేకవేసి నెత్తి బాదుకుంటూ బిగ్గరగా ఏడవసాగింది. ఆ ఏడుపు విని ఆ వీధిలోవాళ్లు కొంతమంది అక్కడికి వచ్చేరు గాభరాగా.

పాపయ్యకు ఇంకా పూర్తిగా తెలివి తప్పిపోలేదు. హృదయ విదారకంగా విలపిస్తున్న భార్యవేపు దీనంగా చూసేడు! "ఈ పాపిస్టోడికోసం ఎందుకే ఇంతలా ఏడుత్తావు? నిన్ను సంపాలనుకున్నోడు సత్తున్నప్పు డేడుపెందుకే?" అని అనాలని పాపయ్య ప్రయత్నించేడు. కాని అనలేకపోయేడు!

తన చుట్టూ మూగినవాళ్ళలో నాగమ్మఉందేమో నని చూడాలనుకున్నాడు. కాని చూడలేకపోయేడు.

"నాకు నువ్వి డాకులివ్వనన్నావు కదూ? అంచేత నానే నిన్నొగ్గని ఎలిపోతున్నాను! ఇప్పుడు నువ్వు కే పెళ్ళెట్టుకోవాలో తెలుసా? దేవుడికాడ!" అని పోలమ్మతో అనాలనుకున్నాడు. కాని అనలేకపోయేడు!

తను సరికొత్తగా పట్టిన కోడెనాగుచే కాటేయించి పోలమ్మను అంతమొందించాలనే దుష్టసంకల్పంతో వచ్చిన తాను మరేదో నాగుపాము ఎక్కడనుంచో వచ్చి ఆమెను కాటెయ్యబోతున్నప్పుడు చూస్తూ ఊరుకోలేకపోవడానికి హేతువేమిటి? ఈ విచిత్రమైన మానవ మనస్తత్వంగురించి ఆలోచించడానికి మరి పాపయ్యకు వ్యవధి లేకపోయింది! ★



## మద్రాసులో జెమిని రోదసీ నౌక మందసం ప్రదర్శనం

అమెరికా ఇద్దరిద్దరు వ్యోమగాములతో 12 జెమిని రోదసీ ప్రయోగాలు చేసింది. ఈ యాత్రలలో ఉపయోగించిన రోదసీ నౌక మందసం నమూనాను మార్చి ఆఖరి వారంలో మద్రాసులో ప్రదర్శనం ఏర్పాటు చేశారు. ఈ నమూనా మందసం 14 అడుగుల పొడవు ఉంది. దీనిని ఒక ఎత్తైన వేదిక మీద అందరికీ కనుపించేలాగా పెట్టారు. జెమిని వ్యోమయాత్రలకు సంబంధించిన ఫోటోలుకూడా చూపారు. జెమిని రోదసీ యాత్రలకు సంబంధించిన చలనచిత్రాలుకూడా చూపారు.

